# లవ్ స్టోరీ

# అమృతపుత్రి



ఇసుక బస్తాను దొర్లించినట్టు నన్ను ప్లాట్ ఫాం అనే కంకర్రాళ్ల గుట్ట మీదకు నెట్టేసి ఎక్స్ ప్రెస్ అంత టెక్కుగా వెనక్కు తిరిగి చూడకుండా పాసింజర్ బండి చక్కా వెళ్లిపోయింది.

రాత్రి సమయం. ఆకాశంలో మేఘాలు దట్టంగా కమ్మాయి. నిర్మానుష్యమైన ప్రదేశం. కీచురాళ్ల రొద. కనుచూపు మేరలో ఇళ్లు కానీ, నర సంచారీ కానీ కానరాలేదు. నాకు ఒక్కసారిగా వళ్లు జలదరించింది.

అదో ముదనష్టపు రైల్వే స్టేషన్. పేరు ఏమైతే నేం నా పాలిట అది నరక కూపం. దానికి నేను అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ని. ప్రమోషన్ వచ్చే సమయానికి పై అధికారులతో కీచులాడటం ధర్మమాని పనిష్మెంట్ లాంటి ప్రమోషన్ వచ్చింది. అరణ్య మధ్యంలో వెలసిన ఏకైక స్టేషన్ ఇటు ముప్పై కిలోమీటర్లు, అటు అరవై కిలోమీటర్ల దూరంలో హాల్ట్ స్టేషన్ లేదు. బళ్ల క్రాసింగ్‌కు అవకాశం లేకపోవడం వల్ల యిక్కడ స్టేషన్ వెలగ బెట్టారు. తప్పని పరిస్థితిలో స్టేషన్ పెట్టారు కాబట్టి సదుపాయాలు కూడా అందుకు తగ్గట్టే వున్నాయి.

ఏదో పాడుబడ్డ రైలు పెట్టెకి గది ఆకారం యిచ్చి అందులోనే అన్నీ గడిపేస్తున్నారు. అందులోనే స్టేషన్ మాస్టరు వుండాలి. స్టాఫ్ పేరుతో ఓ లైన్‌మన్ - అతనే కూలీ, బంట్రోతు, గంట కొట్టేవాడు, చప్రాసీ అన్నీనూ. ఆ ఒక్కడూ లేనప్పుడు స్టేషన్ మాస్టరే అన్నీ. ఇదంతా యిక్కడికి రాకముందే వూదరగొట్టారు మా వాళ్ళు.

ఆలోచనల్లోంచి బయటపడుతూ గుడ్డి దీపం వెలుగులో పాడుబడ్డ రైలు పెట్టె వైపు నడిచాను. లైన్‌మెన్‌ను లేపాను. ఉలిక్కిపడ్డట్టు లేచాడు. నా వివరాలు చెప్పాను. ఆవలిస్తూ విని తన పేరు చెప్పాడు. తర్వాత గదిలో ఓ మూలగా చాప పరిచాడు. పడుకోండి అన్నట్టు సైగ చేశాడు. అతనికి నిద్రా భంగం యిష్టం లేనట్టుంది. మారు మాట్లాడకుండా దేహాన్ని చాప మీద పడేశాను.

తెల్లవారింది. బయటకు వెళ్లి కావాల్సిన వస్తువులు తెచ్చుకుందామనుకున్నాను. అదో అడివి, చుట్టుపక్కల బజారు లాంటిది ఏదీ లేదని, ఏ వస్తువు కావాలన్నా వారానికి ఓ పర్యాయం పదిమైళ్ల అవతల జరిగే సంతలో తెచ్చుకోవలసిందేనని స్థల పురాణం అత్యంత శ్రద్ధా భక్తులతో వినిపించాడు తిరపతి. తనే గ్రామంలోకి వెళ్లి ఒకటి రెండు వస్తువులు వూరి వాళ్ళ నుంచి రొట్టెలు కాల్చాడు. రుచి సంగతి అప్పుడు ఆలోచించలేదు కానీ రెండు మూడు రోజుల్లో నాకు ఒక విషయం అర్థమయింది - ఇలాగే కాలం వెళ్లదీస్తే నా తల్లిదండ్రులు నిస్సంతు అవుతారు.

ఒకరోజు తీరుబాటుగా అలా వూళ్లోకి బయలు దేరాం. "ఇక్కడ పాలు దొరుకుతాయా?" అంటూ తిరపతి ఓ దానయ్యను అడిగితే "పర్వతాలు యింటికి వెళ్లండి" అన్నాడు.

ముందుకు వెళ్ళాం. పర్వతాలు యింటి ముందు నిలబడ్డాం. అభ్యర్థనగా మేము చెప్పింది విని అతడు మండిపడ్డాడు. పాలు అమ్మటం దొంగ సారానో, హెరాయినో అమ్మినంత తప్పుగా భావించాడు.

"పోనీలే అయ్యా! కాస్తంత పాలు పోద్దాం" అంటున్న మధుర కంఠ ధ్వని విని అటుగా చూశాను. స్వచ్ఛమైన యవ్వనంతో పొంగుతున్న అద్భుత లావణ్యవతి. ప్రకృతి ఒడిలో పెరగటం వల్ల సహజ సౌందర్యంతో మెరిసిపోతోంది. ఉజ్వలమైన రంగు, కళ్లలో కటారులు, పై ఎదలో చెదురులు, అంగాంగాలలో చక్కలిగింతలు. అనేక సంవత్సరాలుగా స్టేషన్లో పనిచేస్తూ వచ్చాను. వేల సంఖ్యలో రైలు ఎక్కి దిగే వాళ్లను చూశాను. ఇంత అందమైన భారతీయ స్త్రీని చూళ్లేదు.

ఆమె లోనికి వెళ్లి పాలు తెచ్చింది. నా చేతిలో లోటా వుంది. దగ్గరకు వచ్చి ఆమె పాలు అందులో నింపింది. ఆమెను దగ్గరగా చూసేందుకు ఈ అవకాశం యిచ్చిన ఆ సృష్టికర్తకు ధన్యవాదాలు అర్పించాను. ఎవరో దేవకన్య అమృతం పంచి యిస్తున్న అనుభూతి. ఐదు రూపాయల నోటు ముందుంచితే 'నాకు వెలగడతారా' అన్నంత రుసరుసగా చూస్తూ వెళ్లిపోయింది.

ఇక ఆ రోజంతా ఎలా గడిపానో నాకే తెలీదు. ఎటు వెళితే అటు వెంటాడుతున్న చంద్రబింబంలా ఆమె నన్ను వెంబడిస్తోంది. కానీ యిప్పుడు ఆ దారి ఎంతో మనోహరంగా వుంది. ఆమె తీపి తలపులు నన్ను పులకితుణ్ణి చేయడం వల్ల కావచ్చు, ప్రకృతి సింగారించుకున్నట్టు కనపడింది. ఆ పాడుబడ్డ రైల్వే స్టేషన్ బృందావనం, నందనవనంలా వుంది. ఇంత కాలం నిస్సారంగా గడిపిన జీవితానికి ఓ సార్థకత సాధించినట్టుంది.

మర్నాడు మళ్లీ బయలుదేరాను. ఏం చెయ్యను మరి - నా మనసు నిలవలేదు. ఎటూ తోచని స్థితి. నా ప్రాణాలు నిలవాలంటే ఆమె దర్శనం ఎంతో అవసరమనిపించింది.

నా సుకృతం అని చెప్పాలి - వెళ్లగానే ఎంతో ఆదరణ లభించింది. ఆమె తండ్రి తాను ప్రేమతో గుడిసె ముందు కనపడ్డాడు. కళ్లతో ప్రణామం చేస్తూ ఆమె ప్రత్యక్షమయింది. అక్కడున్నది వారిద్దరే. మరెవరూ లేరు. ఈతాకు చాప పరచి ఆమె తండ్రి నన్ను కూర్చోమన్నాడు. మెరిసే



కళ్ళతో, అందాలు విరజిమ్ముతూ వచ్చి ఆమె పాలు పోస్తుంటే నా శరీరం అంతరిక్ష యాత్రికునిలా భారహీనత సంతరించుకుంది.

ఆమె పేరు ధనియా. నాకు మాత్రం ధన్య. ధన్యకూ నాకూ మధ్య దూరాలు క్రమంగా తొలగిపోతున్నాయి. కానీ గ్రామం కళ్ళు మాత్రం మమ్మల్ని తీక్షణంగా గమనిస్తూనే వున్నాయి. గ్రామం అంటే ఎంతని! పట్టుమని వంద గడపలు లేవాయె! ప్రతి వారి కదలికా వూరంతా తెలిసిపోతూంటుందక్కడ. ధన్య వంటి అపురూప సౌందర్యరాశి మనసును ఒడిసిపట్టిన నా భాగ్యం చాలామంది శత్రువుల్ని తయారు చేసిపెట్టింది. శత్రువు, కోతి మనం ఎంతగా భయపడుతూంటే అంత భయపెడతాయి. ధైర్యం తెచ్చుకున్నాను. ఒకసారి మాటల మధ్యలో గ్రామస్థుల వెర్రి చూపుల ప్రస్తావన వచ్చింది. సిగ్గుతో ఎరబడే ఆమె ముఖం కోపంతో కందగడ్డయింది. "ఎందుకు మీరింత భయపడతారు? వాళ్ళు మన ప్రాణాలు తీస్తారా? అది వాళ్ల వల్ల కాదు. మన జోలికొస్తే వాళ్ళ అంతు చూస్తాను" అంది. ఆమె సాహసం నాలో పిరికివాళ్లి తరిమేసింది. నా కోసమే దేవతలు అపురూప మధువు నింపిన మధుపాత్ర ధన్య. ఆస్వాదించలేని వాడు అదృష్టహీనుడు. అనే శంతో ఆమెను నా హృదయానికి హత్తుకుందామని తహతహలాడాను. ఆమె తప్పించుకుని దూరంగా నిలబడింది. క్షణం ఆమె కళ్ళు ఎర్రబడ్డాయి. నేను భయపడ్డాను. "భయపడ్డారా? మీపై కోపపడేంత దానినా? అయినా మన మధ్య ఈ దూరం అవసరం" అంది.

ధన్య తన ప్రేమను పవిత్రంగా వుంచాలనుకుంది. అది నాకూ నచ్చింది. కానీ ఎప్పుడూ ఏదో తెలియని వేదనతో వివర్ణమయే ఆమె ముఖం నాలో ఏదో సందేహాలు రేకెత్తించేది. నాకు చేరువవ్వాలని ఎంతగా పరితపిస్తున్నా ఏదో అగాధం మమ్మల్ని వేరు చేస్తున్నట్టుంది. అది తెలుసుకోవాలని నేను ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది.

ఒకనాడు సర్పాలపై పరిశోధన జరిపేందుకు దంపతులొకరు ఆ గ్రామం వచ్చారు. తల దాచుకుందుకు దారిలేక వాళ్ళు నన్ను ఆశ్రయించారు. నాకూ కాలక్షేపంగా వుంటుందని అందుకు అంగీకరించాను. భార్యాభర్తలిద్దరూ నాతో ఎంతో చనువుగా వుంటున్నారు. ధన్యకు మాత్రం వారి రాక కలత కలిగించింది. నేను వాళ్లతో సన్నిహితంగా వుండటం ఆమెకు సుతరామూ యిష్టం లేదు. ఆ విషయం నాకు పదే పదే చెప్పినా నేను అంతగా చెవి ఒగ్గలేదు.

ఒకరోజు భర్త బయటకు వెళ్లాడు. భార్య యింట్లో వుండి ఏదో నోట్సు రాసుకుంటోంది. మధ్యమధ్యలో నాతో వుల్లాసంగా మాట్లాడుతూనే తన పని చేసుకుంటోంది. తన వెంట తెచ్చిన తినుబండారాలు తాను తింటూ నా వళ్లోకి విసురుతోంది. అవి తినటం యిష్టం లేక నేను వాటిని ప్రక్కకు నెడుతూ వచ్చాను. ఆమె లేచి చిరుకోపం ప్రదర్శిస్తూ ఒక బిస్కట్టు అదాటున నా నోట్లో కుక్కింది. ఆమె పకపక నవ్వుతోంది. అప్పుడే నేను తలుపు వైపు చూశాను. ఎదురుగా పెద్ద పులిలా ధన్య. ఆమె కళ్ళు చింత నిప్పుల్లా వున్నాయి. నేను బెదిరిపోయాను. ఆమె నిశ్శబ్దం మాటల కంటే భయంకరంగా వుంది. పిలుస్తున్నా వినిపించుకోకుండా గిరుక్కున వెనుదిరిగి వెళ్లిపోయింది.

మర్నాడు గూడ్సు బళ్ల క్రాసింగ్ పని చూసి లోపలకు అడుగుపెట్టానో లేదో అక్కడి దృశ్యం చూసి నేను బిత్తరపోయాను. నా అతిథి అస్తవ్యస్త స్థితిలో నేలమీద గిలగిల తన్నుకుంటోంది. నోటి వెంట నురుగు కక్కుతోంది. ఒళ్లు స్వాధీనంలో లేదు. నేను నిశ్చేష్టుడినయ్యాను. సమయానికి ఆమె భర్త కూడా లేడు. తిరపతి కోసం గట్టిగా కేకలు వేస్తూనే ఆమెను సమీపించి కాళ్ళూ చేతులూ రుద్దాను. మా ప్రయత్నంలో మేముండగానే మరి కొంతసేపటికి ఆమె మంచు ముద్దయింది. ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలో చిక్కుపడ్డాము. మందూ మాకూ లేక ఆమె మరణించింది. ఇంటికి తిరిగి వచ్చిన భర్త ఈ దుర్ఘటన వార్త విని భోరుభోరున ఏడ్చాడు. నల్లబడ్డ ఆమె ముఖం చూసి పాము కాటు వల్ల ఆమె మరణించిందని నిర్ధారించారు. విష సర్పం కాటుకు అకాలంలోనే ఆమెకు కాలం చెల్లిపోయింది.

ఈ వార్త తెలిసినప్పుడు ధన్య ఎలాంటి ప్రతిస్పందనా చూపలేదు. నాకు ఆశ్చర్యం వేసింది. దానితో పాటు ఆ రోజు ఆమె ఎక్కువ వుల్లాసంగా కనిపించడం చూసి నాకు ఆమె పట్ల సందేహం

# కొత్త రచయితలు

కూడా కలిగింది. కానీ ఏమని చెప్పటం!? ధన్య ఇలాంటి ఘాతుక చర్యకు పాల్పడుతుందా? ఆ ఊహకే నిలువెల్లా జలదరించిపోయాను. ఆ క్షణంలో ధన్య ప్రమాదకరమైన యువతిగా తోచింది. సర్పంతో ప్రతినిత్యం ఆడుకునే ఆమె నన్నే ఇది అనిపించి తల్లడిల్లిపోయాను. ఒక స్త్రీ ఈర్ష్యతో ఇంత సాహసానికి ఒడికడుతుందా? ఏమో! ఎలా ఊహించటం? స్త్రీ స్వభావం మహా మహులకే అర్థం కాలేదు. ఆమె పట్ల నేను కొత్త జాగ్రత్త వహించటం మొదలుపెట్టాను.

ఒకరోజు నన్ను సమీపించి ఆమె లాలనగా అంది - "నన్ను పొరపాటుగా అర్థం చేసుకుంటున్నారు. నేను అలాంటి దానిని కాదు. నాకు మీరు దూర మవ్వటం భరించలేను. అంతమాత్రాన నేను మాయలాడిని కాను!"...ఆమె కళ్ళు శరన్మేఘా లయ్యాయి. ఆమె ప్రేమ వచనాలు నా సందేహాల్ని కూల్చేశాయి. ప్రేమగా దగ్గరకు తీసుకుని ఓదార్చాను. ఆమె అంగాంగాలలో ఆకర్షణ. తన్మయత్వంలో ఆమెను గాఢాలింగనంలో బంధించాను. మత్తుగా నా గుండెలపై వాలిపోయింది. నా వక్షస్థలం ఆమె స్పర్శకు పులకించిపోయింది. ఆ క్షణంలో ఈ త్రిభువనాలలో మేము ఏకాంతవాసులం. ఎక్కడో పెళ్ళుమని మెరుపు మెరిసింది. ఉలిక్కిపడ్డట్టు ఆమె నా నుంచి తొలగిపోయింది. ఆవేశంలో మేము ఏమి చేయబోయామో తలచుకుంటే ఇప్పటికీ నా గుండె లయ తప్పుతుంది. ఆమె నాకు దూరంగా నిలబడి పోయింది. నాలో వియోగ వ్యధ వర్ణనాతీతంగా వుంది.

మా ఏకాంత సేవ వార్త గ్రామంలో వ్యాపించింది. ధన్య తండ్రిని నలుగురూ నానా మాట లన్నారు. అతడు ఎంత మాత్రం చలించలేదు. పంచాయితీ పెట్టారు. శిక్ష విధిస్తామని బెదిరించారు. అప్పటికీ అతని సమాధానం మౌనమే. అతని నిబ్బరం నాకు కూడా ఆశ్చర్యం కలిగించింది.

అలా ప్రయత్నించి విఫలమయిన వారు ఈసారి నా మీద పగబట్టారు. ఇలాంటి తప్పుడు పనులు చేస్తే ప్రాణాలతో గ్రామ పొలిమేరలు దాటనని నన్ను బెదిరించారు. "ఆయన మీద చెయ్యిబడితే నాకు ఆత్మాహుతే శరణ్యం" అని ధన్య ప్రత్యుత్తర మిచ్చింది.

అంతటితో అంతా సర్దుమణిగిందని నేను అను కోవడం నా పొరపాటే! ఇరవై నాలుగు గంటల్లో జరగరానిదే జరిగింది. నేను నిద్రపోతున్న సమయంలో ఎవరో నాకు మత్తు మందు వాసన చూపించారు. నేను స్పృహ తప్పి పడి వుండగా ఆ గదిలోకి విష సర్పాన్ని వదిలిపెట్టారు. శత్రువులు పన్నిన ఆఖరి పన్నాగమిది. విధి ఆడిన ఆఖరి నాటకం.

నేను స్పృహ తప్పి వున్న స్థితిలో పక్కకు ఒత్తిగిల్లాను. ఆ క్షణానికై ఎదురు చూస్తున్న నాగుబాము చటుక్కున కాటు వేసింది. చుట్టుపక్కల డాక్టరన్న వాడు లేదు. విషానికి విరుగుడు ఇవ్వగలిగిన గ్రామస్థులంతా నాకు శత్రువులు. ఒకే ఒక సహాయకుడనుకున్న తిరపతి కూడా వారిలో కలిసి పోయాడు. అతడే నాకు మత్తు మందు వాసన చూపించి స్పృహ కోల్పోయేట్టు చేసింది.

నేను మరి కొద్ది క్షణాలలో అంతిమ శ్వాస పీల్చడం ముగించి వుండేవాణ్ణి. ధన్య పరుగు పరుగున నా గదిలో ప్రవేశించింది. నా పరిస్థితి చూసి బిగ్గరగా అరిచింది. నన్ను గాఢంగా కౌగిలించుకుంది. ఏ ఆలింగనం కోసం నేను ఇంత వరకు ఎదురు తెన్నులు చూశానో అది నా చివరి క్షణాలలో లభించడం అంతా విధి. ఆ మధురానుభూతిని ఆస్వాదించే స్థితిలో అప్పుడు నేను లేను. ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ తన బాహుపాశంలో నన్ను బిగియంగా బంధిస్తోంది. ఆమె ఆఖరి ఆలింగనం నన్ను ఉన్మత్తుణ్ణి చేస్తోంది. ఆమె కన్నీళ్ళతో నా మొహం తడిసి పోతోంది.

మరుక్షణం ఆమె తన పెదవులను నా పెదవులకు ఆన్చింది. ఎగిరి ఎగిరి నా పెదవులు కొరుకుతోంది. సర్పిణిలా నన్ను కాటు వేస్తోంది. ఉన్మత్తంగా చుంబిస్తూ నా రక్తం తోడేస్తోంది. క్రమంగా నా శరీరంలోని మంట చల్లారింది. నేను మరణించలేదని తెలిసింది. నా పరిస్థితి చక్కబడింది. కళ్ళు విప్పి చూశాను. ఎదురుగా ధన్య-ఆశ నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతూ!మరో ఇద్దరు ముగ్గురు ఆమె చుట్టూరా, ఇక్కడ ఏమి వింత జరుగుతుందో చూద్దామని వచ్చినట్టున్నారు. అదేమీ పట్టించుకోకుండా ధన్య నా పెదవుల నుంచి రక్తం పీలుస్తోంది. అంతలోనే నా కళ్ళు మూతలు పడ్డాయి.

కళ్ళు తెరిచి నప్పుడు నేను ధన్య ఒడిలో పడివున్నాను. ఆమె ఏదో పసరు పాము కాటుకు గురైన నా శరీర భాగానికి రాస్తోంది. ఆమె తండ్రి పక్కనే నిలబడి వున్నాడు. అతడే ఆ పసరు తెచ్చి వుంటాడని నేను గ్రహించాను. ఆమె ఏదో తరళ పదార్థం ఒక పాత్రలోనింపి నా పెదవులకు అందించింది. నేను నిస్సంకోచంగా తాగేను. దాని ప్రభావం ఇంజక్షన్‌లా వుంది. వెంటనే నా దేహంలో శక్తి ప్రసారం జరిగింది. నేను లేవడానికి ప్రయత్నించాను. ఆమె నాకు ఆసరా ఇచ్చింది.

"ధన్యా! నేను ఎలా బ్రతికాను?"




రచయిత్రి చిరునామా
కె.రాజ్యలక్ష్మి
ఆదిత్య అపార్ట్‌మెంట్స్
గురునానక్‌నగర్
విజయవాడ.


ఇదే నా మొదటి మాట. "అంతా బాబా చలన" అంటూ తన తండ్రి వంక చూపించింది. నేను కృతజ్ఞతతో ఆయనకు నమస్కరించాను. ఆయన వినయంగా ప్రతినమస్కారం చేసి అక్కణ్ణుంచి తప్పుకున్నాడు.

ఏకాంతం ఆమెలో భావోద్రేకాన్ని లేపింది. గాఢంగా నన్ను కౌగిలించుకుంటూ "ఏ కంటే నాకే ఎక్కువ భయం వేసింది తెలుసా! నువ్వు లేక పోతే నేను బ్రతకను!" అంటూ బేలగా ఏడ్చింది.

"నన్ను దగ్గరకే రానిచ్చే దానివి కాదు మరి. ఇప్పుడెందుకు ఇంత సాహసం చేశావు?" అన్నా న్నేను.

"ఇప్పుడు మీరు విషపుత్రులు" అంటూ పకపకా నవ్వింది. నాకు మతి పోయింది.

"నేను విషకన్యను" అంటూ మళ్ళీ నగల బడి నవ్వింది. నేను మరింత ఆశ్చర్య పడ్డాను.

"ఏమిటిదంతా? ఏమంటున్నావు నువ్వు?"


"నేను చెబుతున్నది యథార్థమే! నేను విష కన్యను కాబట్టే మిమ్మల్ని బ్రతికించుకో గలిగాను. పాము విషానికి విరుగుడు పాము విషమే!"


"నువ్వు విష కన్యవా?"


"అవును. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో కొంత మంది తెల్లవాళ్ళు మన దేశ భక్తుల్ని తరుముకుంటూ ఈ ప్రాంతం వచ్చారు. అప్పుడే పెళ్ళయి నిండు యవ్వనంతో అలరారుతున్న మా అమ్మ పై వారి కన్నుపడింది. మర్నాడు ఏటి ఒడ్డున పొంచి వుండి వారు మా అమ్మను కాటు వేశారు. ఆత్మహత్య చేసుకోవాలన్న మా అమ్మ ప్రయత్నం విఫలమయింది. నువ్వు లేనిదే నేను బ్రతకలేనంటూ మా అయ్య అమ్మను ఓదార్చాడు. కానీ అత్యాచార ఫలితంగా మా అమ్మ గర్భం ధరించింది. ఈ పరిణామంతో మరింతగా కృంగి పోయిన మా అమ్మ కాలసర్పం విషంతో తన దేహాన్ని, ప్రేమను పవిత్రం చెయ్యాలని ప్రయత్నించింది. ఫలితంగా గర్భంలో వున్న నా శరీరం విష పూరితమయింది. మా అయ్య దేవుడు. తన భార్య రోజూ విషం కొంచెం కొంచెంగా దిగమింగుతూందని తెలియక పుట్టబోయే పరాయి సంతానం కోసం పరవశంగా ఎదురు చూశాడు. నేను పుట్టిన కొన్నాళ్ళకే మా అమ్మ కన్ను మూసింది. అయినా మా అయ్య కంటికి రెప్పలా నన్ను కాపాడుతూ వచ్చాడు. ఈ విష కన్యకు ఎలా పెళ్ళి చెయ్యాలా అన్నదే మా అయ్య దిగులు."


ఇంతవరకు చెప్పి, సంతోషమూ విచారమూ కలగలిపి చూసింది ధన్య.


"ధన్యా! నువ్వు విషకన్యవు కావు. అమృత పుత్రివి. నాకు ప్రాణ దానం చేసిన అప్సరసవు" అంటూ ఆమెను గాఢంగా హత్తుకున్నాను. ◆


దసరా మామూళ్ళు ఇవ్వటానికి డబ్బుల్లేవు గానీ నీ మంగళసూత్రం ఇటివ్వు! తాకట్టు పెట్టి డబ్బు తీసుకొస్తా!


వెయ్యి రూపాయలు దసరా మామూళ్ళు వసూలు చేసి పట్టుచీర కొనిస్తానన్నారు గదా! చీర తెచ్చారా?
వెయ్యి రూపాయలు వసూలు చేశాను! నేను ఇవ్వాల్సిన దసరా మామూళ్ళ క్రింద పదకొండు వందలు ఖర్చు అయినయ్!!
PRASAD


మొన్న నేను తీసుకొన్న రెండు కోట్లూ ముడుపని మీరందరు అనుకొంటున్నారు! కానీ ఆ డబ్బుని నేను తీసుకొన్నది "దసరా మామూలు" క్రిందని మనవి!!
PRASAD


గమనిక
ఎవరైనా దసరా మామూలు అడిగితే మేనేజర్‌కు ఫిర్యాదు చేయండి...
గోడతో బాటు ఆ బోర్డు మీద గూడ రంగు వేసెయ్యి.... లేకుంటే ఈసారి మాకు ఎవ్వడూ దసరా మామూలు ఇవ్వడు.....
LDC


బోలెడు కథలు చెప్పా, కాబట్టి ఓ విక్రమార్కా! దసరా మామూలు ఇవ్వనాకు!


ఏమండీ! ఇది పెళ్ళికి కొన్న పట్టుచీరండీ! పాత చీర కట్టుకొని రానా....